నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు



రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల గృహ సముదాయం గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, సామూహిక పారాయణంకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముగింపు రోజు 27వ తేదీ ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని 30వ తేదీ రాత్రి 7 గంటలకు పంచాంగ పఠనం ఉంటుందని వివరించారు. ఇక ఏప్రిల్ 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

కాలనీ కార్యవర్గం ఎన్నిక

మాదాపూర్: మాదాపూర్ అరుణోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.కోటేశ్వర రావు ఎన్నికయ్యారు. కార్యదర్శి యం.శ్రీహరి, ఉపాధ్యక్షుడు వసంతకుమార్, జాయింట్ సెక్రటరీ నంది, కోశాధికారి సుబుద్ధి, కార్యవర్గ సభ్యులు జీఎస్.రెడ్డి, సుబ్బరాజు, ఆర్.వై.ప్రభు, కృష్ణప్రశాంత్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి ఎన్.ఆర్ ప్రసాద్ సభ్యులను అభినందించారు.

టీబీపై అవగాహన ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం కూకట్‌పల్లి రామ్‌దేవ్ రావు ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పగడాల శిరీష హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దగ్గు, దమ్ము వచ్చిన వెంటనే ముందు జాగ్రత్తగా వైద్యులను సంప్రదించి క్షయ టెస్టులను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, నాయకులు వెంకటేశ్, లలిత, శారద, పృథ్వీరాజ్, ఆసుపత్రి వైద్యులు కమలాకర్, ఆసుపత్రి సీఈఓ డాక్టర్ యోబు, బీఎంహెచ్ఓ ఉమాగౌరి, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి, పద్మావతి, కల్పన పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఎల్లమ్మబండ శిల్ప బృందావనంలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవంను కనులపండువగా సోమవారం నిర్వహించారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్‌గౌడ్ హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. పుర వీధులలో స్వామివారి రథోత్సవంను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శిల్పబృందావనం కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపల్ పరిధి చిటుకుల్ గ్రామంలో గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, చిన్న రాములు, గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ స్వాగత తోరణం ప్రారంభం

నియోజకవర్గంలో ఆలయ నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వందనాపురి కాలనీలో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం స్వాగత తోరణాన్ని సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, సీనియర్ నాయకులు రమేష్‌గౌడ్, ప్రమోద్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ఆలస్యం.. అవస్థలు

నత్తనడకన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- త్వరగా పూర్తి చేయాలని వినతి



మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో జరుగుతున్న పనులు

మియాపూర్: అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో జాప్యంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణాలోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణం అనే ఆరోపణలు వినబడుతున్నాయి. మియాపూర్ విశ్వేశ్వరయ్య కాలనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రధాన రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులను నెల రోజుల క్రితం ప్రారంభించారు. పనులు మందకొడిగా సాగుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డు మధ్యలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు పైన మట్టికుప్పలు, గుంతలు ఉండడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

- విశ్వేశ్వరయ్య కాలనీలో డ్రైనేజీ సమస్య నెలకొనడంపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఎమ్మెల్యే గాంధీ స్పందించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి.
- జాతీయ రహదారిపై అధిక ట్రాఫిక్ కారణంగా బొల్లారం, బాచుపల్లి, తదితర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు ఈ రోడు వెంబడి జేపీనగర్ మీదుగా వెళ్తుంటారు. అవేవిధంగా కృషినగర్, జేపీఎన్ నగర్, ప్రశాంత్‌నగర్, ఎంఏనగర్, మక్తమహబూబ్‌పేట్, బీకేఎన్‌క్లేవ్, హెచ్ఎంటీ కాలనీ, రెడ్డి కాలనీ చుట్టుపక్కల కాలనీలవాసులు కొండాపూర్, హైటెక్ సిటీకి వెళ్లేందుకు ఈ రోడ్డు వెంబడి రాకపోకలు చేస్తుంటారు. ఐతే ఈరోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతుండడంతో నెల రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. కనీసం కాలినడకన కూడా వెళ్లేందుకు దారి లేకపోవడంతో పాదచారులు, వాహనదారులు రెండు, మూడు కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.
- నెల నుంచి కనీసం 50 మీటర్ల మేర పనులు పూర్తి కాకపోవడం గమనార్హం. పనులు పూర్తి చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించడం లేదని ఆరోపణలు వినపడుతున్నాయి. సరైన క్యూరింగ్ చేయకుండానే మట్టిని పూడ్చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో భారీ వాహనాలు వెళ్లే క్రమంలో మ్యాన్‌హోళ్లు కుంగిపోయే అవకాశముందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని ప్రజలుకోరుతున్నారు.





సమస్యల పరిష్కారానికి కృషి



జనప్రియ-5వ ఫేజ్‌లో పర్యటిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ 5వ ఫేజ్‌లో స్థానిక నాయకులతో పర్యటించి, స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు సంజీవ రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి మేనేజర్ శ్రీధర్, నాయకులు మూర్తి, చిన్నబాబు, కోటేశ్వరరావు, అశోక్, జితేందర్‌సింగ్, మహిళలు జ్యోతి రెడ్డి, సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ఆల్విన్‌కాలనీ డివిజన్ మహిళా అధ్యక్షురాలులిగా రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా సౌందర్య, పుట్టందేవి, జనరల్ సెక్రటరీలుగా నాగలక్ష్మి, సుజాత, జాయింట్ సెక్రటరీగా దారుపల్లి లక్ష్మి, బండారు మణెమ్మలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం దిశగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాగం నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. 25 వినతులు



శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో ఆయా ప్రాంతాలలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 25 వినతులను అధికారులు స్వీకరించారు. సోమవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 15 మంది వివిధ సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతులు అందజేశారు. వెస్ట్ జోనల్ పరిధిలోని యూసూఫ్‌గూడ సర్కిల్ 2, శేరిలింగంపల్లి సర్కిల్‌లో 4, చందానగర్ సర్కిల్‌లో 4 వినతులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్, ఆస్తిపన్ను, ఇంజనీరింగ్ విభాగాల సమస్యలపై వినతులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యతగా క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని సూచించారు.

గృహిణి ఆత్మహత్య

క్రైం కార్నర్..

మియాపూర్: కుటుంబ కలహాలతో గృహిణి ఉరేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి ఖల్దేర్ మండలం మీర్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన కూలి అల్లమయ్య, పద్మ దంపతుల కుమార్తె భవాని (తులసి(20)ని మెదక్ జిల్లా అల్లాదుర్గంకు చెందిన అశోక్‌కి ఇచ్చిన గత రెండు సంవత్సరాల క్రిందట వివాహం చేశారు. అశోక్, భవానీ దంపతులు మియాపూర్ స్టాలిన్‌నగర్‌లో ఉంటున్నారు. అశోక్ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి 8 నెలల పాప ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అశోక్ బియ్యం తీసుకురావడానికి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో భవానీ ఇంట్లో ఉన్న కిటికీకి ఉరివేసుకుంది. రాత్రి 8 గంటలకు అశోక్, అమ్మ సరోజిని ఇంటికి వచ్చారు. ఎంత పిలిచినా భవానీ పలుకకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరేసుకుని కనిపించింది. మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు భవానీ తండ్రి అల్లమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మియాపూర్: జాతీయ రహదారిపై వాహనం ఢీకొన్న ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ కృషినగర్ కాలనీలో వెంకటనరసింహం (77) భార్య పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. ఈ నెల 21వ తేదీ చందానగర్‌లో ఆసుపత్రికి వెళ్లేందుకు బయల్దేరాడు. మదీనాగూడలోని విజయ్ సేల్స్ ముందు జాతీయ రహదారి దాటుతుండగా చందానగర్ నుండి మియాపూర్ వైపు వెళ్లే వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో వెంకటనరసింహం కిందపడ్డాడు. గాయాలపాలవడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుమారుడు సతీష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని దగ్గర్లో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ వెంకటనరసింహం సోమవారం ఉదయం మృతి చెందాడు. తండ్రి వెంకటనరసింహం మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు సతీష్‌కుమార్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడు మృతి

గచ్చిబౌలి: విద్యుదాఘాతంలో ఓ సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాములు తెలిపిన ప్రకారం..మహారాష్ట్ర ఔరత్‌కు చెందిన సతీష్ లక్ష్మణ్ తెలంగ్(36) హఫీజ్‌పేట్‌లో నివాసం ఉంటూ సోదరుడు సోమనాథ్‌తో కలిసి సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గచ్చిబౌలిలో ఇర్ఫాన్ అనే కాంట్రాక్టర్ వద్ద సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఐదవ అంతస్తులో రాడ్ కటింగ్ మిషన్ పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. వెంటనే కొండాపూర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రేక్ డౌన్.. ట్రాఫిక్ జాం



గచ్చిబౌలి: కారు బ్రేక్ డౌన్ కావడంతో ట్రాఫిక్ జాం నెలకొంది. కిలో మీటర్ల పొడవునా వాహనాలు నిలిచి పోవడంతో మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు కారును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. సైబర్ టవర్ ఫ్లైఓవర్ పై సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఐ10 కారు బ్రేక్ డౌన్ అయ్యింది. దీంతో వెనకాల వాహనాలు బారులుదీరాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు కారును తొలగించి వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

టీ9 ఛాలెంజ్ గోల్ఫ్ టోర్నీ ట్రోఫీ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: గోల్ఫ్ క్రీడను ప్రమోట్ చేసే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఆరో రియాల్టీ టీ9 ఛాలెంజ్ గోల్ఫ్ టోర్నీ మూడో సీజన్ ట్రోఫీని టీ గోల్ఫ్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ ఎస్ఆర్ఎస్ రెడ్డి, సీఎఫ్ వో మధుసూదన్ రావు ఆవిష్కరించారు. 16 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ ప్రీక్వార్టర్ మ్యాచ్‌లు ముగిశాయి. పూల్ ఏ నుంచి ట్యూటోరూట్, బంకర్ బస్టర్స్, పూల్ బి నుంచి ఫెయిర్ వే ఫాల్కన్స్ సన్‌షైన్ డెయిరీ , పూల్ సి నుంచి లావిస్టా క్రుసేడర్స్ , పూల్ డి నుంచి శ్రీనిధి డెక్కన్ వారియర్స్, సిమెట్రిక్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి.



ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గంలో పలు స్తంభాలు రోడ్డుపైకి ఒరిగాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. నిత్యం ఈ మార్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రాణాలు పోతేనే అధికారులు స్పందిస్తారా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నీటి పొదుపుపై అవగాహన

శేరిలింగంపల్లి: వాటర్ ఎయిడ్ ఇండియా హైదరాబాద్, అభ్యుదయ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో లింగంపల్లి ప్రైమరీ స్కూల్‌లో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు భీమయ్య మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నల్లాల ద్వారా నీరు లీకేజీ కాకుండా చూడాలన్నారు. భవిష్యత్‌లో నీటి సమస్య తలెత్తకుండా ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసి వర్షపునీరు భూమిలోకి వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి పొదుపుపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు గుమ్మడి జగన్, విలేజ్ కమిటీ అడ్వైజర్ దేవులపల్లి శ్రీనివాస్, వాటర్ ఎయిడ్ ప్రతినిధులు విజయరేఖ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

రాయదుర్గం: రంగారెడ్డిజిల్లా కలెక్టర్ కార్యాలయంలో దివ్యాంగుల సెక్షన్‌లో అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరుతూ రాష్ట్ర దివ్యాంగుల సంఘం, శేరిలింగంపల్లి ప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దూర ప్రాంతాల నుంచి సమాచారం కోసం దివ్యాంగులు కష్టపడి వస్తే సమాచారం ఇచ్చే వారు లేరని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల అశోక్‌కుమార్ ముదిరాజ్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలో మల్లికార్జున స్వామి కల్యాణంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మీనారాయణ, కిషోర్ గౌడ్, సీనియర్ నాయకులు నాగుల్ గౌడ్, రమేష్ యాదవ్, శివకుమార్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి కిందపడి వ్యక్తి మృతి



శ్రీనివాసరాజు (ఫైల్)

మియాపూర్: రెండంతస్తుల భవనంపై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భీమవరానికి చెందిన పి. శ్రీనివాస్‌రాజు(53) కుటుంబంతో కలిసి మియాపూర్ మయూరినగర్‌లోని దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్ -5 బ్లాక్ ప్లాట్ నంబర్ -204లో నివాసముంటున్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో శ్రీనివాస్‌రాజు టిఫిన్ చేసి బయటకు వెళ్లాడు. రెండో అంతస్తు నుంచి పడిపోయాడు. స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి డాక్టర్లు పరీక్షించి శ్రీనివాస్ రాజు మృతి చెందినట్లు తెలిపారు. గత ఆరు నెలలుగా శ్రీనివాస్ రాజు బీపీ, షుగర్ తో బాధపడుతున్నాడని తరచూ టెన్షన్ పడేవాడని తానే దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భార్య దేవి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మియాపూర్: ఎలక్ట్రికల్ స్టోర్‌లో మొబైల్స్ చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం...చింతల్ గాంధీ నగర్‌కు చెందిన శీలం దుర్గా వెంకట సాయితేజ(25) మియాపూర్ మదీనాగూడలోని క్రోమా ఎలక్ట్రికల్ షోరూంలో గత 8 నెలల నుండి సేల్స్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా గత కొన్ని రోజులుగా తాను పనిచేస్తున్న స్టోర్‌లో మొబైల్ ఫోన్లను దొంగిలించడం ప్రారంభించాడు. స్టోర్‌లో విలువైన ఫోన్లు కనిపించకపోవడంతో స్టోర్ మేనేజర్ దేవిప్రసాద్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 20న ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తులో భాగంగా స్టోర్‌లో పనిచేస్తున్న దుర్గా వెంకట సాయితేజను అదుపులోకి తీసుకుని విచారించగా ఫోన్లు దొంగిలించినట్లు అంగీకరించాడు. అతని వద్దనుండి సుమారు రూ.3లక్షలు విలువచేసే ఐఫోన్ -15బ్లూ, సామ్‌సంగ్ ఎస్ -25 ఫోన్లు, ఐఫోన్ -16ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

బంగారం కొనుగోలు మోసం కేసులో దర్యాప్తు ముమ్మరం

గచ్చిబౌలి: బంగారం కొనుగోలు పేరిట ఘరానా మోసానికి పాల్పడిన కేసులో గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రత్యేక బృందాలు కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో నిందితుడి కోసం గాలిస్తున్నాయి. ఎక్కువ కమీషన్ ఇస్తానని బంగారం కొనుగోలు పేరిట ఓ బాధితుడి వద్ద 500 గ్రాముల బంగారం, ఎక్స్చేంజ్ పేరిట మరో బాధితుడి వద్ద 18 వేల డాలర్లతో ఉడాయించిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో ఆధార్ కార్డు ఆధారంగా నిందితుడు స్టీవ్ గాడ్విన్‌గా గుర్తించారు. లోతుగా విచారణ చేస్తే ఆధార్ కార్డు నకిలీగా గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కొంత మేర నిందితుని వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం...ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 7 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమాన, 15 మందికి రూ .1500, మరో వ్యక్తికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.



ఫ్లైఓవర్.. పచ్చదనం

గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లితండాలో ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్డు వైపు గ్రీనరీని ఏర్పాటు చేయడం ఈ రోడ్డుకు అందాన్ని చేకూర్చినట్లయింది. గోపన్‌పల్లి తండా కూడలిలో 'టీ' ఆకారంలో నిర్మించిన ఫ్లైఓవర్ కిందిభాగంలో వాహనదారులకు పచ్చదనం ఆహ్లాదం కలిగిస్తోంది. - రాయదుర్గం



